

23 నుంచి యల్లమ్మదేవి జాతర

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా గంగావతి తాలుకా శ్రీరామనగర్‌లోని రాఘవేంద్ర కాలనీలో రేణుకా యల్లమ్మదేవి జాతర మహోత్సవం ఈ నెల 23, 24 తేదీల్లో జరగనుంది. 23న ఉదయం గంగ పూజ, పూర్ణ కుంభంతో ఉత్సవాలకు శ్రీకారంచుట్టనున్నారు. అదే రోజు అమ్మవారి పల్లకి ఉత్సవం వైభవోపేతంగా నిర్వహించనున్నారు. 24న సకల రోగ నివారణ కోసం పలు హోమాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ వెల్లడించింది. ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయనున్నారు.

మాటల తూటాలు

- వంద కేసులు పెట్టినా బెదరను : మాజీ మంత్రి ఈశ్వరప్ప
- మీరే చంపేయండి.. ఈశ్వరప్పకు కాంగ్రెస్ ఎంపీ సురేశ్ సవాల్
- బెదిరింపులకు భయపడే రక్తం కాదు మాది : డీసీఎం డీకే శివకుమార్



బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాలకు గ్రాంట్ల విడుదలలో కేంద్రం అన్యాయం కొనసాగితే భవిష్యత్తులో ప్రత్యేక దక్షిణభారత దేశ డిమాండ్ ఏర్పడే ప్రమాదం ఉందంటూ కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ చేసిన వ్యాఖ్యలపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య ఇంకా వాక్ సమరం కొనసాగుతూనే ఉంది. డీకే సురేశ్ వ్యాఖ్యలను ఖండిస్తూ ఇలాంటి దేశద్రోహులను కాల్చి చంపాలంటూ బీజేపీకి చెందిన మాజీ మంత్రి కేఎస్ ఈశ్వరప్ప చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు మరింతగా ఆజ్యం పోశాయి. ఈశ్వరప్ప బేషరతుగా క్షమాపణ చెప్పాలంటూ హోం శాఖ మంత్రి డాక్టర్ జి. పరమేశ్వర్ సూచించారు. ఈ నేపథ్యంలో శివమొగ్గలో శనివారం ఈశ్వరప్ప మీడియాతో మాట్లాడారు. తనపై వంద ఎఫ్ఐఆర్‌లు దాఖలైనా బెదరను అన్నారు. తన వ్యాఖ్యలను గట్టిగా సమర్థించుకున్న ఆయన తాను దేశద్రోహులను కాల్చి చంపాలని పిలుపునిచ్చాను తప్ప నిర్దిష్టంగా డీకే సురేశ్‌ను ఉద్దేశించి చెప్పలేదని పేర్కొన్నారు. క్షమాపణ చెప్పే ప్రశ్నే లేదన్నారు. దేశద్రోహ ప్రకటన చేసిన కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్‌పై కేసు నమోదు చేయకుండా తనపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారన్నారు. ముందుగా ఆయనకు నోటీసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాను చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు అనవసర గందరగోళం చేస్తున్నారన్నారు. ఎవరు దేశద్రోహులో... ఎవరు దేశభక్తులో... న్యాయస్థానమే తేలుస్తుందన్నారు. తనకు క్లీన్‌చిట్ లభిస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. దేశద్రోహ వ్యాఖ్యలు చేసేవారిని కాల్చిచంపేలా చట్టాలు రూపొందించాలని ప్రధాని నరేంద్రమోదీకి ఆయన మరోసారి విజ్ఞప్తి చేశారు. ముచ్చటగా మూడోసారి ప్రధాని అయ్యాక దేశద్రోహుల అంతం మోదీ చేపట్టడం ఖాయమన్నారు. దేశద్రోహానికి మతంతో సంబంధం లేదని తెలిపారు. బెంగళూరులో శనివారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర మీడియాతో మాట్లాడుతూ ఈశ్వరప్ప వ్యాఖ్యలపై ఆచితూచి స్పందించారు. తనపై కేసులను ఎదుర్కొనే సత్తా ఈశ్వరప్పకు ఉందన్నారు. కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ మీడియాతో మాట్లాడుతూ ఏడున్నర కోట్ల కన్నడిగుల ప్రయోజనాల కోసమే తాను మాట్లాడానని, దీనికి తనపై దేశద్రోహం ముద్ర వేశారని, బీజేపీ నేత ఈశ్వరప్ప అయితే ఏకంగా కాల్చి చంపాలని పిలుపునిచ్చారని పేర్కొన్నారు. తనను ఎవరో కాల్చి చంపాల్సిన అవసరం లేదని, మీ చేతులమీదుగానే కాల్చేయండి సమయం, స్థలం చెప్తే నిర్భయంగా వస్తానంటూ సవాల్ విసిరారు. మహాత్మాగాంధీనే వదలని రాజకీయ పార్టీ నుంచి ఏమి ఆశించగలమంటూ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. తన వ్యాఖ్యలను వక్రీకరించి బీజేపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, వీటిని రాజకీయంగానే ఎదుర్కొంటానని ప్రకటించారు.

అలాంటి చట్టం తెస్తే బీజేపీ సగం ఖాళీ : మంత్రి ప్రియాంక ఖర్గే

దేశద్రోహానికి పాల్పడినట్టు రుజువైతే శిక్షించేందుకు చట్టాలు ఉన్నాయని, రాజ్యాంగం ఉందని ఐటీబీటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గే పేర్కొన్నారు. నగరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈశ్వరప్ప డిమాండ్ మేరకు దేశద్రోహానికి పాల్పడినవారిని కాల్చి చంపాలనే చట్టం తెస్తే సగం బీజేపీ ఖాళీ అవుతుందని ఎద్దేవా చేశారు. ఈశ్వరప్ప రాజకీయాల నుంచి రిటైరయ్యారని, ఆయనను పార్టీ పూర్తిగా పక్కన పెట్టేసిందని, కుమారుడి టికెట్ కోసం వెంపర్లాడుతూ అధిష్ఠానం ప్రాపకం కోసం నోరు పారేసుకుంటున్నారంటూ విరుచుకుపడ్డారు.





డీకే సురేశ్

బెదిరింపులకు భయపడేది లేదు..

తన సోదరుడు, ఎంపీ డీకే సురేశ్ శరీరంలో రక్తం బీజేపీ నేత ఈశ్వరప్ప బెదిరింపులకు లొంగేది కాదని కేపీసీసీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. బెంగళూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వివాదాస్పద వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పేందుకు ఈశ్వరప్ప నిరాకరించిన అంశాన్ని ప్రస్తావించగా ఆయనను తామెవ్వరూ క్షమాపణ కోరలేదన్నారు. రాజకీయాల్లో ఇలాంటి బెదిరింపులు తమకు కొత్త కాదన్నారు. కన్నడిగుల ప్రయోజనాలను బీజేపీ ఎంపీలు రక్షించలేకపోతున్నారన్న ఆక్రోశంలో డీకే సురేశ్ కొన్ని ఘాటు పదాలు వాడారన్నారు. దీని అర్థం దేశాన్ని విభజించడం కాదన్నారు. బీజేపీ తనకు కావాల్సిన రీతిలో ఈ వ్యాఖ్యలపై వక్రభాష్యం చెబుతోందని మండిపడ్డారు.



బళ్లారిలో ఈడీ కలకలం



ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి ఇంటి ముందు ఈడీ అధికారుల హడావుడి

- ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఇల్లు, కార్యాలయాల్లో సోదాలు
- బంధువులు, అనుచరుల ఇళ్లపైనా దాడులు
- రంగంలోకి 40 మంది ఈడీ అధికారులు, 50 మంది ఆర్‌పీఎఫ్ పోలీసులు

బళ్లారి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బళ్లారి ఈడీ అధికారుల సోదాలు కలకలం రేపాయి. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లు, కార్యాలయాలపై భారీ స్థాయిలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించడం సర్వత్రా చర్చనీయాంశమయింది. బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఆయన తండ్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణరెడ్డి వారి అనుచరులు, బంధువుల ఇళ్లలో శనివారం ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఉదయం ఈడీ అధికారులు 40 మంది, వారితోపాటు 50 మంది రిజర్వు పోలీస్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) బలగాలతో రంగంలోకి దిగారు. వీరు ఆరు బృందాలుగా విడిపోయి ఉదయం ఏకకాలంలో సోదాలు చేశారు. బళ్లారి గాంధీనగర్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే నారా సూర్యనారాయణరెడ్డి కార్యాలయం, ఆయన తనయుడు, బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిన్నాన్న, బుడా మాజీ అధ్యక్షుడు నారా ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యే పీఏ రత్నబాబు, సూర్యనారాయణరెడ్డి అల్లుడు అనిల్‌కుమార్‌రెడ్డి, వీరికి అత్యంత సన్నిహితుడు, కాంట్రాక్టర్ సతీష్‌రెడ్డి, చెన్నైలో ఉన్న సూర్యనారాయణరెడ్డి కార్యాలయం, అక్కడే ఉన్న ఆయన కూతురు ఇంటిపైనా ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈడీ సోదాలు చేసేందుకు వెళ్లినప్పుడు ఎమ్మెల్యే భరత్‌రెడ్డి బళ్లారి నెహ్రూకాలనీలో ఉన్న తన సొంత ఇంటిలో తల్లితో పాటు ఉన్నారు. సూర్య నారాయణరెడ్డి అక్కడే కార్యాలయంలో ఉన్నారు. ప్రతాప్‌రెడ్డి ఈడీ వెళ్లినప్పుడు ఇంటిలో లేరు, ఆయన కుటుంబికులు మాత్రమే ఉన్నారు. ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ప్రతాప్‌రెడ్డి కలబురిగిలో ఎన్నికల ప్రచారంలో ఉన్నారు. ప్రతాప్‌రెడ్డిని ఈడీ ఫోన్ చేసి బళ్లారికి రప్పించింది. ఉదయం 6 గంటల నుంచి ఈడీ అధికారులు వీరి ఇళ్లతో పాటు కార్యాలయాల్లో సోదాలు చేశారు. ఎమ్మెల్యే తండ్రి నారా సూర్యనారాయణరెడ్డి గ్రానైట్ రంగంలో ప్రముఖ వ్యాపారి. గ్రానైట్ వ్యాపారంతో పాటు రాజకీయంగా చురుకుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఈడీ అధికారులు ఏకకాలంలో సోదాలకు దిగారు. ఈడీ వెంట ఆర్‌పీఎఫ్ బలగాలను తీసుకొచ్చారు. స్థానికంగా ఉన్న పోలీసులకు సమాచారం ఇచ్చి అవసరమయితే మీ సహాయం ఇవ్వండి అని తెలిపారు. స్థానిక సివిల్ పోలీసులు ఈడీ సోదాలు జరుగుతున్న సమయంలో ఇంటి బయటే ఉన్నారు. ఈడీ వీరిని లోపలికి అనుమతించలేదు. ఈడీ అధికారులకు ఎమ్మెల్యే, ఆయన కుటుంబికులు పూర్తిగా సహకరించినట్లు సమాచారం. సోదాల విషయం తెలుసుకుని కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు అక్కడికి చేరుకున్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ రాజకీయ దురుద్దేశంతో సోదాలు, దాడులు చేయిస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు.


కొనసాగుతున్న సోదాలు

శనివారం రాత్రి వరకూ ఈడీ సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదాయపు పన్నులా, లేక ఇతర వ్యవహారాలపై సోదాలు నిర్వహిస్తున్నారా అనేది సమాచారం ఇవ్వడం లేదు. వీరిపై ఇంతకు ముందు ఏమైనా ఆర్థికపరమైన కేసులు ఉన్నాయా అనేది కూడా ఈడీ స్పష్టత ఇవ్వడంలేదు.

రాజ్యసభ టిక్కెట్ కోసం పైరవీల జోరు

- కాంగ్రెస్ అధిష్ఠానంపై పెరిగిన ఒత్తిళ్లు

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శాసనసభ్యుల సంఖ్య ప్రకారం రాష్ట్ర కాంగ్రెస్ నుంచి ముగ్గురు రాజ్యసభకు సులభంగా గెలుపొందేందుకు వీలున్న తరుణంలో టిక్కెట్ల కోసం ప్రముఖులు పైరవీలు చేస్తున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి ఈ అంశం తలనొప్పిగా మారింది. కాంగ్రెస్ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ, ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రఘురాం రాజన్ విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన దేశానికి ఈనెల 15న వెనుతిరిగి రానున్నారు. అదే రోజు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగియనుంది. శివసేన ముఖ్యుడు ఉద్ధవ్‌ఠాక్రేను ఇటీవలే రఘురాం రాజన్ భేటీ అయ్యారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు ఒకరు ఎన్నికయ్యే అవకాశం ఉంది. దీంతో మహారాష్ట్ర నుంచి రఘురాంరాజన్ పోటీ చేసే అవకాశం ఉంది. రాష్ట్రం నుంచి బీసీ కోటాలో సవితా సమాజానికి చెందిన ఎంసీ వేణుగోపాల్‌కు టిక్కెట్ ఇవ్వాలని ఆ వర్గం డిమాండ్ చేస్తోంది. దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రముఖులు సమావేశం నిర్వహించి అవకాశం ఇవ్వాలనే కోరారు. ఒక్కలిగ కోటాలో బీఎల్ శంకర్‌కు రాజ్యసభ అవకాశం కోసం డిమాండ్ పెరుగుతోంది. ఎంసీ వేణుగోపాల్, రాష్ట్ర హోంశాఖ మంత్రి పరమేశ్వర్‌కు అత్యంత ఆప్తుడు. ఆయన గతంలో ఎమ్మెల్సీగా వ్యవహరించారు. ముస్లిం సముదాయం నుంచి మన్సూర్ అలీఖాన్‌కు రాజ్యసభలో చోటు కల్పించాలని పలువురు అధిష్ఠానానికి డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు సయ్యద్ నాసిర్ హుసేన్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారని, ఆయనకు బదులు మన్సూర్‌కు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇలా మూడు స్థానాలకు ఆరేడుగురికి పైగా పైగా పోటీ పడుతుండడంతో అధిష్ఠానం ఎంపిక చేయడంలో తలమునకలైంది.



ప్రజల హక్కులను చట్టాలు హరించలేవు

- మాజీ లోకాయుక్త జస్టిస్ సంతోష్ హెగ్డే

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల హక్కులను చట్టాలు హరించజాలవని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, మాజీ లోకాయుక్త సంతోష్‌హెగ్డే పేర్కొన్నారు. బెంగళూరులో శనివారం యూనివర్సల్ స్కూల్ ఆఫ్ లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. కేశవానంద భారతి స్వామిజీ, కేరళ ప్రభుత్వాల మధ్య జరిగిన దావాకు సంబంధించి ఒక తీర్పు వెలువడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ఈ తీర్పు ప్రస్తుత న్యాయ విద్యార్థులకు, విద్వాంసులకు గొప్ప అధ్యయన అంశంగా ఉందన్నారు. న్యాయ విద్యార్థులు ఎప్పటికప్పుడు వెలువడే తీర్పులతో పాటు గతంలో వెలువడిన కీలకమైన తీర్పులను అధ్యయనం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎడనీరు మఠాధిపతి సచ్చిదానంద భారతి స్వామిజీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణలో ఈ తీర్పు అత్యంత కీలకమైనదిగా అభివర్ణించారు. తమ మఠానికి చెందిన భూమిని కాపాడుకునే దిశలో రా జ్యాంగ పోరాటంలో విజయం లభించడం గొప్ప విషయమన్నారు. ఎన్నికల ముందు ఓటర్లు అవినీతి ఉచ్చులో కూరుకుంటారని, ఎన్నికల అనంతరం నేతలు అవినీతి ఉ చ్చులో విలవిలలాడతారని స్వామిజీ చమత్కరించారు. మాజీ అడ్వకేట్ జనరల్ రవివర్మకుమార్, యూనివర్సల్ స్కూల్ ఆఫ్ లా అధ్యక్షుడు ఆర్ ఉపేంద్రశెట్టి, ప్రిన్సిపాల్ విశ్వాస్ పుట్టస్వామి, కళాశాల పాలనాధికారి సంతోష్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.



వేదికపై మాజీ జస్టిస్ సంతోష్‌హెగ్డేకు సన్మానం

ఎన్ఐఏ ఎస్పీగా రాహుల్‌కుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు దక్షిణవిభాగం డీసీపీగా వ్యవహరించిన రాహుల్‌కుమార్ శెహపురవాడ్ నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) ఎస్పీగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శికి కేంద్ర హోం శాఖ శుక్రవారం లేఖ రాసింది. ఐదేళ్ల అవధికి రాహుల్ ఎన్ఐఏ ఎస్పీగా సేవలందిస్తారని లేఖలో పేర్కొన్నారు. మహారాష్ట్ర కేడర్‌లోని 2012 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. కర్ణాటకలోని బంట్వాళ్‌లో ఏఎస్పీగా తన కెరీర్‌ను ప్రారంభించిన ఆయన అనంతరం హాసన్, తుమకూరు ఎస్పీగా సేవలందించారు. కొన్ని నెలలుగా బెంగళూరు దక్షిణ విభాగం డీసీపీగా సేవలందిస్తున్నారు.



రాహుల్‌కుమార్

మాజీమంత్రి రమేశ్ జార్కిహోళికి హైకోర్టులో ఊరట

- చక్కెర ఫ్యాక్టరీ కేసులో చర్యలు తీసుకోరాదంటూ ఆదేశం



బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చక్కెర ఫ్యాక్టరీ అభివృద్ధికి తీసుకున్న రుణం సకాలంలో చెల్లించని కేసులో మాజీ మంత్రి, బెళగావి జిల్లా బీజేపీ ఎమ్మెల్యే రమేశ్ జార్కిహోళికి హైకోర్టు ధర్మాసనం ఊరటనిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికి అనుబంధమైన అపెక్స్ బ్యాంక్ నుంచి రూ.439 కోట్లు రుణం తీసుకుని తిరిగి చెల్లించకుండా జాప్యం చేస్తున్న మేరకు సహకార శాఖ అధికారులు చర్యలకు సిద్ధమయ్యారు. బెళగావిలోని సౌభాగ్యలక్ష్మి షుగర్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రమేశ్ జార్కిహోళితోపాటు ఇతరులపైనా కేసులు నమోదయ్యాయి. వీటిపై హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణ ఎస్ దీక్షిత్ ఏకసభ్య ధర్మాసనం శుక్రవారం తీర్పునిచ్చింది. రమేశ్‌జార్కిహోళి తరపు న్యాయవాదులు ఈనెల 26న పిటీషనర్ కుమారుడి పెళ్లి ఉందని విచారణ పేరిట అరెస్టు చేయవచ్చునని వివరించారు. తాత్కాలికంగా సదరు వివాదంలో ఎటువంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయితే సమగ్ర వివరాలు తదుపరి వాయిదాకు కోర్టుకు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

సామాజిక, ఆహార భద్రతకు పెద్దపీట

- కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం
- ఎన్నికల ప్రణాళికలో మరిన్ని గ్యారెంటీలు
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దేశ సమాఖ్య వ్యవస్థను తూట్లు పొడిచే, రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను అడ్డుకునే దిశలో దేశ ప్రజల సామాజిక, ఆహార భద్రతలకు పెద్దపీట వేసేలా కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక ఉంటుందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిటీ కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశం సీఎం ప్రసంగిస్తూ దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని, ప్రయోజనాలను కాపాడే సత్తా, చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు మాత్రమే ఉన్నాయన్నారు. కేంద్రంలో యూపీఏ హయాంలో మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలోనే ఆహార భద్రతాచట్టం, విద్యాహక్కు చట్టం, సమాచార హక్కు చట్టాలు అమలులోకి వచ్చిన సంగతిని గుర్తు చేశారు. దేశ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం కాంగ్రెస్ సంప్రదాయమన్నారు. 2013లో రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను 98 శాతం నెరవేర్చామన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో పలు గ్యారెంటీ పథకాలు ఉంటాయని ఆయన సూచనప్రాయంగా తెలిపారు. మోదీ ప్రభుత్వంలో మాదిరిగా ఇవి ప్రజలను మభ్యపెట్టేలా ఉండవని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తున్న ఐదు గ్యారెంటీ పథకాలతో బెంబేలెత్తిన బీజేపీ, అనవసర విషయాలను తెరపైకి తెస్తూ ప్రజల్లో గందరగోళం రేపుతోందని ఆరోపించారు. అభివృద్ధి అజెండాతోనే ప్రజల్లోకి వెళ్దామని ఆయన బీజేపీకి సవాల్ విసిరారు. దేశంలోని ప్రస్తుత సామాజిక సమస్యలకు కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో స్పష్టమైన పరిష్కార మార్గాలు సూచిస్తామని ప్రణాళిక కమిటీ సభ్యుడు రాజా తెలిపారు. నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు రాజీవ్ గౌడ మాట్లాడుతూ కర్ణాటకలోని గ్యారెంటీ పథకాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రణాళిక దేశ ప్రజలకు పరిపూర్ణ భరోసా ఇచ్చేలా ఉంటుందన్నారు. మన్మోహన్‌సింగ్ పదేళ్ల పాలనలో దేశ ప్రజల జీవితాలు రూపుదిద్దుకుంటే మోదీ పదేళ్ల పాలనలో సర్వం ఛిద్రమైందన్నారు. ఎంతగా గారడీలు చేసినా ప్రజలు నమ్ముతారని బీజేపీ భావిస్తోందన్నారు. ప్రజల ముందు బీజేపీ నాటకాలు ఎల్లకాలం సాధ్యం కావని పేర్కొన్నారు. నరేగా పథకానికి మరింత ఊతమిచ్చేలా, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పెంచేలా పట్టణాలు, నగర యువతలో ఆశాకిరణంలా ఎన్నికల ప్రణాళిక ఉంటుందని తెలిపారు. గ్యారెంటీ పథకాలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందన్న బీజేపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టారు. నాగ్‌పూర్ విద్యావిధానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేసే ప్రశ్నే లేదని ఆయన తేల్చి చెప్పారు. రాష్ట్ర విద్యావిధానానికి తుది మెరుగులు దిద్దేందుకు మంత్రి సుధాకర్ సారథ్యంలో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. కర్ణాటక విద్యావిధానం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుందని, ఫలితంగా అంతర్జాతీయస్థాయిలో 500కు ప్రముఖ కంపెనీలను భారతీయులు నిర్వహించే వాతావరణం నెలకొందన్నారు. సమావేశంలో కేపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రణాళికా కమిటీ సభ్యుడు మెహ్రాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.02	1,612.97
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	83	9,270
సామర్థ్యం (టీఎంసీలు)	9.45	43.76

సరిహద్దుల్లో మట్కా విజృంభణ

● కర్ణాటక- ఆంధ్ర సరిహద్దుల్లో మట్కా కంపెనీల హవా ● ఎన్నికల విధుల్లో పోలీసులు ● ఇదే అదనుగా దూసుకెళుతున్న నిర్వాహకులు

బళ్లారి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు వచ్చాయంటే కొంతమందికి పండగ. మరికొంతమందికి ఆటవిడుపు. ఈ సమయంలో పోలీసులు ఎలాగూ ఎన్నికల విధుల్లో ఉంటారు. తమ వంక తిరిగిచూసే తీరిక వారికుండదు. అందుకే ఈ సమయాన్ని తమ వ్యాపారానికి అనుకూలంగా మలుచుకున్నాయి కర్ణాటక-ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దులో మట్కా కంపెనీలు. బళ్లారి-బొమ్మనహాళ్ మండలం మధ్య అటు అడుగు వేస్తే కర్ణాటక- ఇటు అడుగు వేస్తే ఆంధ్ర సరిహద్దులు ఉంటాయి. సున్నితమైన ఈ ప్రాంతంలో గత మూడు నెలలుగా మట్కా కంపెనీలు పట్టుకొస్తున్నాయి. అలాగే బళ్లారి- రామాపురం మధ్యలో ఓబుళాపురం వద్ద మరో మట్కా కంపెనీ వెలసింది. కర్ణాటక ప్రాంతానికి చెందిన మట్కా రన్నర్లు, అలాగే ఆంధ్రలో ఉండే కొందరు మట్కా బీటర్లు కలిసి ఇక్కడ కంపెనీలు నిర్వహిస్తున్నట్లు ప్రజలు అంటున్నారు. బొమ్మనహాళ్ మండల కేంద్రానికి కొద్ది దూరంలో కర్ణాటక బళ్లారిలోని రూపనగుడి దారి దాటిన తరువాత పెట్రోల్ బంకు సమీపంలో మరో మట్కా కంపెనీ నిర్వహిస్తున్నట్లు బొమ్మన హాళ్‌కు చెందిన కొందరు యువకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ మట్కా కంపెనీ నెలకొల్పడం వల్ల మట్కా ఊబిలో చిక్కుకున్న పేదకుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వీటిని అరికట్టాలని స్థానిక యువకులు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే బళ్లారి- రామపురం వద్ద ఒక మట్కా కంపెనీని, డి.హీరేహాళ్ మండలం జాజురకల్లు, హిర్దేహాళ్ మధ్యలో ఒక మట్కా కంపెనీని నెలకొల్పి



మట్కా కంపెనీల చార్టు

రెండు రాష్ట్రాల హద్దుగా విచ్చల విడిగా మట్కా నడుపుతున్నట్లు ప్రజలు పోలీస్ వర్గాలకు ఫిర్యాదు చేశాయి. కర్ణాటకలో ఉండే ఒక రాజకీయ నాయకుడి అనుచరులు, అలాగే ఆంధ్రలోని బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ మండలాల్లో ఉండే అధికార పార్టీ కీలక నాయకులు మట్కా కంపెనీ నిర్వహకులకు సపోర్టు చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకు కొందరు పోలీసులు కూడా మద్దతుగ వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎన్నికల హడావిడి ప్రారంభమవుతుండడంతో రెండు రాష్ట్రాల పోలీసులు ఎన్నికల బందోబస్తులో నిమగ్నమవుతున్నారు. దీన్ని అలుసుగా తీసుకున్న కొందరు మట్కా కంపెనీల నిర్వహకులు సరిహద్దులో కంపెనీలు ఏర్పాటు చేశారని తెలుస్తోంది. కర్ణాటక సరిహద్దులో ఉండే కంపెనీలకు ఆంధ్రలోని కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, మండలాలతో పాటు కర్ణాటక రూరల్ ప్రాంతం నుండి ఎక్కు వుగా మట్కా బీటర్లు వస్తున్నారని సమాచారం. మామూలుగా ఫోన్ ఎస్ఎంఎస్ ద్వారా మట్కా రన్నింగ్ అవుతుంది. కానీ ఇక్కడ కొందరు నేరుగా మట్కా రాసేవాళ్లు ఇక్కడికి వస్తుండడంతో మట్కా విచ్చలవిడిగా సాగుతోంది. చాలా మంది మట్కా జూదంకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ప్రజలు అంటున్నారు. కొందరు యువకులు బళ్లారి ఎస్పీకి మట్కా కంపెనీ నిర్వహణ పై ఫిర్యాదు చేశారు. ఇందుకు ఎస్పీ స్పందించి వెంటనే రూరల్ పోలీసులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే మట్కా కంపెనీలు నిర్వహించే వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేసి గ్రామ బహిష్కరణ చేస్తామని ఎస్పీ రంజిత్ కుమార్ బండారు తెలిపారు.

ట్రక్ డ్రైవర్ల పిల్లల చదువులకు సాయం.. అభినందనీయం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కల్యాణ స్వామి

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 10: ప్రతిభ కనబరిచిన ట్రక్ డ్రైవర్లు, క్లీనర్లు పిల్లల చదువులకు శ్రీరామ్ ఫైనాన్స్ ప్రోత్సహకాలను అందించడం అభినందించదగ్గవిషయని కల్యాణ మహాస్వామి అన్నారు. నగరంలోని కేఆర్ఎస్ ఫంక్షన్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన విద్యార్థుల ప్రోత్సహకాల కార్యక్రమాన్ని ఆయన శనివారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ్ ఫైనాన్స్ విద్యార్థులకు ప్రోత్సహకాలను అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈసందర్భంగా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ మాధర్ మాట్లాడుతూ పారిశ్రామిక రంగాలలో సాధించిన విజయాలకుగాను 2013లో కేంద్ర ప్రభుత్వం త్యాగరాజన్‌ను పద్మభూషణ్‌తో సత్కరించిందన్నారు. కార్యక్రమంలో బళ్లారి డిప్యూటీ ఫారెస్ట్ కన్జర్వేటర్ సందీప్, సూర్యవంశీ, వి.వి.సంఘం కార్యదర్శి గురుసిద్ధ స్వామి, మాజీ అధ్యక్షుడు ఉడేద బసవరాజు, వాణిజ్య సంస్థ అధ్యక్షుడు మహారుద్రగౌడ, బీడీసీసీ, కో-ఆపరేటివ్ బ్యాంక్ ఆడిట్ చైర్మన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులకు శిక్షణ శిబిరం


కార్యక్రమంలో కవితా ఈశ్వర్‌సింగ్ తదితరులు

హొసపేట, ఫిబ్రవరి 10: పరీక్షలు సమీపిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 8,9,10 తరగతుల విద్యార్థులకు పునీత్ రాజ్‌కుమార్ స్మారకార్థం కవితా ఈశ్వర్‌సింగ్ శనివారం ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాయమ్మ శక్తి సంఘం గ్రామీణ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ప్రారంభించడం హర్షదాయకమన్నారు. కాకుబాల్ గ్రామంతోపాటు చుట్టుప్రక్కల గ్రామాల విద్యార్థుల చదువుకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కాకుబాల్ గ్రామపంచాయితీ చైర్ పర్సన్ కాళమ్మ మాట్లాడుతూ ఈ శిబిరం విద్యార్థుల్లో నూతనోత్సాహాన్ని నింపిందన్నారు. ఈసందర్భంగా శిక్షణ శిబిరం డైరెక్టర్ లలిత, పునీత్‌రాజ్‌కుమార్ సంఘం అధ్యక్షుడు రఘునాయక్, అంబరేశ్, మంజునాథ్, మహి ళా సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పాలనలో అభివృద్ధి నిల్:బీజేపీ


వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 10: గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపనులు కాంగ్రెస్ హయాంలో జరగడం లేదని ఇలా ఎందుకు జరుగుతోందో సమాధానం చెప్పాలని హొసపేట మండల ఎమ్మెల్యేకు శనివారం బీజేపీనాయకులు వినతి పత్రం సమర్పించారు. బీజేపీ మండల కార్యకర్తలు శనివారం విజయనగరం జిల్లా ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి దీనిపై సమాచారం కోరారు. ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు శంకర్‌మేటీ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో ఎన్నో అభివృద్ధి పనులు ప్రారంభించినా ఎన్నికల కారణంగా అవి ఆగిపోయాయన్నారు. ఏడాది గడుస్తున్నా వాటికి అతీగతీ లేదన్నారు. ఈసందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్ మేటీ, నాగరాజు, చంద్ర, గౌతమ్,శేఖర్, లక్ష్మణ,మణి, గౌలి బసవరాజు, రమ్మ, సంధ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది గడ్డివాముల దగ్ధం

కంప్లి, ఫిబ్రవరి 10 : కంప్లి నియోజకవర్గంలోని హడలిగి గ్రామంలో శనివారం ఎనిమిది గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఆకస్మికంగా మంటలు ఏర్పడటంతో ప్రజలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. వెంటనే బళ్లారి కురుగోడు, అగ్నిమాపక దళాలను సంప్రదించగా వారు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఫైరింజన్‌లు హడగలికి చేరుకునేలోపు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.ఆరు నుంచి ఏడు లక్షలు నష్టం వాటిల్లింది. నష్టపోయిన రైతన్నలను ఆదుకోవాలని గ్రామ ప్రజలు, రైతన్నలు కోరారు.

80వ రోజుకు చేరిన రైతుల నిరసన


నిరసన తెలుపుతున్న రైతులు

కంప్లి, ఫిబ్రవరి 10: నాగప్ప చెరువు కింద భూములు సాగు చేస్తున్న రైతన్నలు భూములకు పట్టాలు ఇవ్వాలంటూ సుమారుగా 80 రోజులుగా నిరసనలు చేపడుతున్నారు. ఇంతవరకు అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ రైతులు తమకు న్యాయం చేకూర్చాలని ఎన్ని రోజులుగా పోరాటాలు చేసినా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. రైతులకు పట్టాలు ఇచ్చేవరకు పోరాటం తప్పదన్నారు.

పక్షి ప్రేమికుల స్వర్గధామం.. ఆల్మట్టి

● వలస పక్షులతో సందడిగా జలాశయం ● రంగు రంగుల పక్షుల కిలకిలరావాలు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 10: బాగలకోట జిల్లా బీళగి తాలూకా సరిహద్దులోని ఆల్మట్టి జలాశయం బ్లాక్ వాటర్ పక్షులకు నెలవుగా మారింది. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం తగ్గిపోవడంతో పక్షుల సందడి నెలకొని


నీటిలో సేదదీరుతున్న వివిధ జాతుల పక్షులు

పక్షి ప్రేమికులకు స్వర్గధామంగా మారింది. ఆల్మట్టి డ్యాం బ్యాక్ వాటర్‌లో పక్షుల కిలకిలరావాలు వీనులవిందుగా మారాయి. ఆల్మట్టి నిండితే మూడు రాష్ట్రాలకు తాగు, సాగునీరు అందడమే కాకుండా పరోక్షంగా ఈప్రాంతం పక్షిధామంగా విరాజిల్లుతుంది. డ్యాంలో నీటి మట్టం పూర్తిగా తగ్గిపోయిన నేపథ్యంలో వివిధ రాష్ట్రాల నుంచి పక్షుల సందడి పెరిగింది. ఇక్కడ ఎక్కడచూసినా ప్రకృతి ప్రసాదమైన కొండలు, గుట్టలు, పర్వతాలు కన్పిస్తాయి. నయన మనోహర వృక్షజాలంతో కూడిన పర్యావరణం దేశవిదేశాల నుంచి వచ్చిన పక్షులకు ఆవాసంగా మారింది. ఇక్కడ సంచరించే రాజహంస పక్షిని చూడటమే ఓ రకమైన కనువిందు అని చెప్పుకోవచ్చు.

వైవిధ్యమైన పక్షులు..

ఒకొక్క ప్రాంతంలో ఒక్కొక్క జాతి పక్షులు కనిపించడం సర్వసాధారణం. అయితే బీళగి తాలూకా చిక్కసంగమ పక్షిధామంలో దృష్టి సారించినంత వరకు వివిధ రకాల పక్షుల సమూహాలు కనిపిస్తాయి. అందులోనూ మలేషియా సహా ఉత్తర భారతం నుంచి వలస వచ్చిన ఫ్లెమింగో(రాజహంస) వయ్యారాన్ని చూసి పక్షి ప్రియులు కొత్త అనుభూతిని పొందుతున్నారు. ఈపక్షి సున్నితమైనది. ఆహారంతోపాటు తన సంతానోత్పత్తి కోసం సున్నిత ప్రాంతాలను అన్వేషిస్తుంది.. ఇంకా ఎన్నోరకాల పక్షులు ప్రతి ఏటా నవంబర్ నుంచి మే వరకు ఆహారంతో పాటు సంతానోత్పత్తి కోసం అనువైన సున్నితమైన స్థలాలను వెతుకుతూ ఆల్మట్టికి చేరుకుంటాయి. ఇక్కడ ప్రతిఏటా మరగాల హక్కి, గ్రేటర్ ఫ్లెమింగ్, బార్ ఎయిడెడ్ గీస్, గాడ్విడ్ సిటిల్, గ్రాసి ఐబీస్, గ్లాసి ఐబీఎస్, బ్లాక్‌పింగ్‌డస్ స్టీల్ రివర్ రూడిశెల్వర్, బాయ్‌కళక్, ఓప్‌బిల్డ్‌డక్ తదితర దాదాపు 260 జాతుల పక్షులు కనిపిస్తాయి.

ఎంతోమంది పక్షి నిపుణులు రాక

కర్ణాటక నుంచి కాకుండా దేశంలోని ఢిల్లీ, గుజరాత్, ఒరిస్సా, మహారాష్ట్రలకు చెందిన పక్షి ప్రియులు భారీగా తరలి వస్తున్నారు. వీరి కోసం కర్ణాట ఎకో టూరిజం బోర్డు ఏర్పాట్లుచేసింది. బీళగి తాలూకా చిక్కసంగమ చుట్టుప్రక్కల దాదాపు 60వేల ఎకరాల విస్తీర్ణాన్ని సురక్షిత పక్షిధామంగా ప్రభుత్వం ప్రకటించింది. దీని పరిధిలోని ఎరేకల్, చిక్కసంగమ,బిరకబ్బి, మల్లాపుర, బెన్నూర,సాలగుంది, కదంపుర తదితర ప్రాంతాలలో లెక్కలేనన్ని పక్షులు ఉన్నాయి. పక్షినిపుణులు అధ్యయనం చేయడానికి వీలుగా బాగల్‌కోట ఆటవీశాఖ అధికారులు సమాచారం ఇస్తూ తోడ్పాటునందిస్తున్నారు.

రైతుల అభ్యున్నతికి మత్స్యశాఖ తోడ్పాటు

● వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కేసి వీరణ్ణ

రాయచూరు, ఫిబ్రవరి 10 : రైతుల అభ్యున్నతికి వారికి తగిన ఆర్థిక తోడ్పాటు లభించేలా మత్స్య పరిశ్రమల శాఖ తరపున ప్రభుత్వం తగిన తోడ్పాటునందిస్తుందని బీదర్‌కు చెందిన కర్ణాటక పశువైద్య, మత్స్య విశ్వ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ కేసి వీరణ్ణ అన్నారు. రాయచూరు నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ మత్స్య సంపద జాగృతి అభియాన్ కార్యక్రమాన్ని జ్యోతి వెలగించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ కేసి వీరణ్ణ, రాయచూరు, యాదగిరి జిల్లాలో పౌష్టిక ఆహార లోపం సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో చేపల ద్వారా లభించే ప్రోటీన్‌ల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ప్రజలకు పౌష్టిక ఆహార లోపాన్ని నివారించడంతో పాటు మత్స్య సంపదను అభివృద్ధి చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా మరింత పరిపుష్టి అయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఈ క్రమంలోనే ఏర్పాటు చేసిన అవగాహన జాతాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాతాకు రాయచూరు, యాదగిరి జిల్లాలకు చెందిన పలువురు రైతులు హాజరయ్యారు.

●వెలవెల బోయిన మత్స్య సంపద జాగృతి అభియాన్

గైర్హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు : దేశ ప్రధాన మంత్రి పేరున నిర్వహించే జాతీయ మత్స్య సంపద జాగృతి అభియాన్ కార్యక్రమం వెలవెబోయింది, నగరంలోని వ్యవసాయ విశ్వ విద్యాలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన అభియాన్‌కు మంత్రులే కాదు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సహితం డుమ్మాకొట్టారు. దీంతో కేవలం అధికారులతోనే కొనసాగిన కార్యక్రమం పూర్తిగా బోసిపోయింది. సభ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన స్థళంలో సగం కుర్చీలు ఖాళీగానే కనిపించడంతో కార్యక్రమాన్ని అధికారులు మమ అనిపించారు. కాగా మత్స్య సంపద వృత్తిలో రైతులకు మెళకువలు అవగాహన కల్పించడంతో పాటు ఈ సందర్భంగా మత్స్య సంపదకు సంబంధించి వివిధ రకాల స్టాల్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని అధికారులు చేసిన ప్రయత్నం కేవలం నామమాత్రంగా మిగిలిపోయింది. స్టాళ్లు ఏర్పాటు చేసినా చేపల ప్రదర్శన ఎక్కడ కనపడలేదు. ఏర్పాటు చేసిన స్టాళ్లు సహితం ఖాళీగానే కనిపించడంతో అటువైపు కన్నెత్తి చూసేవారే కరువయ్యారు.


కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగిస్తున్న వీసీ డా.కేసి వీరణ్ణ

22 జంటలకు ఉచిత వివాహాలు


అంకలి మఠంలో 22 జంటలకు ఉచిత సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నదృశ్యం

సిరుగుప్ప, ఫిబ్రవరి 10 : అంకలి మఠం గురువులు వీరభద్రస్వామి సాన్నిధ్యంలో 22 జంటలు ఒక్కటయ్యారు. శనివారం సిరుగుప్ప పట్టణం అంకలి మఠంలో ఉచిత సామూహిక వివాహాలు జరిగాయి. 22 జంటలు ఈ సామూహిక వివాహాల్లో ఒకటయ్యారు. గురువులు నూతన వధూవరులను ఆశీర్వదించి కలకాలం కలిసుండాలని దీవించారు. ఈ సందర్భంగా అంకలి మఠం ప్రముఖులు వై శ్రీనివాస, హుస్సేనప్ప, మల్లికార్జున, వధూవరులు, నగర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు ధ్రువీకరణ పత్రాల అందజేత


రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, ఫిబ్రవరి 10 : వ్యవసాయ హోండా (ఫారమ్‌ఫాండ్) లబ్ధిదారులకు ఎమ్మెల్యే బీఎం నాగరాజు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సిరుగుప్ప తాలుకా నాడంగ గ్రామ పంచాయతీలో వ్యవసాయ భాగ్య పథకం కింద వ్యవసాయ హోండాను నిర్మించుకున్న రైతు మల్లికార్జునకు ఆయన శనివారం ధ్రువీకరణ పత్రం అందజేశారు. రైతులు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను పొంది అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాలుకా అధ్యక్షులు కరిబసప్ప, గ్రామ ప్రముఖులు మారుతి ప్రసాద్ రెడ్డి, కౌన్సిలర్ గణేష్, గ్రామ పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, పదాధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

కంప్లి, ఫిబ్రవరి 10 : బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపైప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ రేణుక తెలిపారు. కురుగోడు తాలుకా పరిధిలోని సింధిగేరి గ్రామంలో శనివారం బాబా అంబేద్కర్ భావచిత్ర రథాన్ని సింధిగేరి గ్రామంలో ఊరేగించారు. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు తాలుకా పరిధిలో రాజ్యాంగ జాగృతి జాతాలు వుంటాయని తెలిపారు. చిన్నారులు, యువతీ యువకులు, ప్రజలు ప్రతి ఒక్కరు రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. అవగాహనతోనే మనజీవితంలో మార్పు వస్తుందన్నారు. వీరితో పాటు ఉపతహసీల్దార్ మల్లేశప్ప, డీటీ విజయ్‌కుమార్, తాలుకా ఈవో నిర్మల, పీడీవో మంజునాథ, గ్రామపంచాయతీ సభ్యులు, అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.


సింధిగేరిలో రాజ్యాంగ రథం ఊరేగింపు దృశ్యం

హోసూరు జోన్

5 కి.మీ. మేర స్తంభించిన ట్రాఫిక్



జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

హోసూరు (సిప్‌కాట్), ఫిబ్రవరి 10 : కర్ణాటక రాష్ట్రంలో నివసిస్తున్న తమిళనాడు ప్రజలు ప్రతి వారాంతంలో సెలవుల కారణంగా తమిళనాడుకు ఎక్కువ సంఖ్యల్లో వస్తుంటారు. దీంతో సెలవు రోజుల్లో మాత్రమే కాకుండా పండుగ రోజుల్లో కూడా రద్దీ ఏర్పడుతోంది. జాతీయ రహదారిపై ఎప్పటికప్పుడు భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. బెంగళూరు నుంచి వచ్చేసమయంలో సిప్‌కాట్, జూజూవాడి ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. అదే విధంగా కర్ణాటక సరిహద్దులోని అత్తిబెలె ప్రాంతంలో జాతీయ రహదారిపై తరచుగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. వాహనాలు పాకుతూ ముందుకుసాగాల్సి ఉంటుంది. వాహనదారులు నానా అవస్థలు పడుతూ ముందుకు సాగుతు ఉంటారు. కాగా హోసూరు సిప్‌కాట్ ప్రాంతంలో ఫ్లై ఓవర్ నిర్మాణం కారణంగా వాహన సంచారాన్ని నియంత్రించడం వలన కూడా తర చూ ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. శనివారం ఏర్పడిన ట్రాఫిక్ విషయం తెలుసుకున్న సిప్‌కాట్ ట్రాఫిక్ విభాగం పోలీసులు ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అయితే తమిళనాడు-కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లోని జాతీయ రహదారిపై సుమారు 5 కిలోమీటర్ల దూరం వాహనాలు నిలిచిపోయాయి. దీంతో వాహన దార్లు చాలా ఇబ్బందులు పడ్డారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 10: ప్రభుత్వం కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించి విద్యుత్ పొదుపు చేయాలని కృష్ణగిరి జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యాలయ సమావేశంలో శనివారంజిల్లా గెజెట్ అధికారుల సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ కెఎం సరయు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలల్లో పర్యావరణ అనుకూల పద్ధతులను పాటించాల్సిన ప్రాధాన్యతను తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మార్గద ర్శకాల ప్రకారం తమిళనాడు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ వాడకం తగ్గించి, విద్యుత్ పొదుపు తదితర అంశాపై అవగాహన కల్పించే ప్రక్రియ జరుగుతోందన్నారు. కార్యాలయాలలో వన్‌టైమ్ డిస్పోజబుల్ ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలని, రెండు వైపులా తెల్లటి షీట్లను ఉపయోగించడం, ఎల్ఈడీలు విద్యుత్ వినియోగాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఉపయోగించిన ప్లాస్టిక్‌లను మళ్లీ మళ్లీ ఉపయోగించవద్దని తెలిపారు. అదే విధంగా అన్ని కార్యాలయాలల్లో కూడా అవగాహన కల్పించాలని, ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపే విధానాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో హోసూరు కార్పొరేషన్ కమీషనర్ స్నేహా, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియంకా, పుష్ప, బాబు, కార్త్యేయని, వివిధ శాఖల శాఖాధికారులు పాల్గొన్నారు.

పూలకరగ ఊరేగింపులో వేలాది మంది భక్తులు

హోసూరు ఫిబ్రవరి 10: హోసూరు సమీపాన చెక్‌పోస్ట్ జూజూవాడి వద్ద శ్రీ దేవి కరుమారియమ్మ ఆలయం 29వ వార్షికోత్సవం జరిగింది పూల కరగ ఎత్తుకుని ఊరేగించారు. ఈ సందర్భంగా గణపతి హోమం, లక్ష్మి పూజ నిర్వహించారు. దీపారాధన, గంగాపూజ, అగ్నికుండ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం జరిగింది. తోపుమారియ్మ, కోట మారియమ్మ, మునీశ్వర స్వామి, యల్లమ్మ, కరుమారియమ్మ, ముత్తుమారియమ్మ, దేవతలనుశనివారం ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, ఆలయ నిర్వాహకులు అందరూ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం రాష్ట్ర సరిహద్దు కావడంతో కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రజలు పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందారు.


పూల కరగ ఊరేగింపు

ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు


పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే దద్దల బసనగౌడ

రాయచూరు, ఫిబ్రవరి 10 : రాయచూరు తాలూకాలోని గణదాళ పంచముఖి ఆంజనేయ దేవాలయంలో శనివారం రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్ర వాల్మీకి కార్పోరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలి సారి ఆలయానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, పాలక మండలి సభ్యులు సంప్రదాయ బద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే దద్దల బసనగౌడ, ప్రభుత్వం తనకు ఇచ్చిన బాధ్యతతో ఎస్టీల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. అదే సమయంలో జిల్లా నియోజక వర్గం అభివృద్ధి కోసం మరింత బాధ్యతతో కృషి చేస్తానన్నారు.

14కిలోల గంజాయి ధ్వంసం


రాయచూరు, ఫిబ్రవరి 10 : జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో దాడుల ద్వారా స్వాధీనం చేసుకున్న 14కిలోల 179గ్రాముల గంజాయిని రాయచూరు పొలిమేరల్లో శనివారం ధ్వంసం చేశారు. వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ వద్దకు తీసుకెళ్లిన గంజాయిని శాస్త్రీయ పద్ధతిలో ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ బి.నిఖిల్ దగ్గరుండి పర్యవేక్షించారు. ధ్వంసం చేసిన గంజాయి విలువ రూ.1,65,900లుగా అధికారులు పేర్కొన్నారు.


గంజాయిని ధ్వంసం చేయడాన్ని పర్యవేక్షిస్తున్న ఎస్పీ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

థామస్ అల్వా ఎడిసన్ (జయంతి)



మానవజాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు, ఫోనో గ్రాఫ్ వంటి ఉపకరణాలను ఆవిష్కరించిన అమెరికాకు చెందిన గొప్ప ఆవిష్కర్త థామస్ అల్వా ఎడిసన్ 1847 ఫిబ్రవరి 11న అమెరికా దేశం ఒహియో గ్రామంలో జన్మించారు. వ్యాపార వేత్తయే కాకుండా ఎలక్ట్రిక్ పవర్ జనరేషన్, మాస్ కమ్యూనికేషన్, సౌండ్ రికార్డింగ్, మోషన్ పిక్చర్స్ వంటి వాటిపై ఎన్నో ఆవిష్కరణలు చేసి 1,093 పేటెంట్‌లు కలిగిన బహుముఖ ప్రజ్ఞాశాలి. తొలి ఇండస్ట్రియల్ ల్యాబ్‌ను రూపొందించిన ఘనత ఆయనదే. 1889లో పారిస్‌లో ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలో 90 శాతానికి పైగా ఆయన రూపొందించినవే. 1931 అక్టోబరు 18న కన్నుమూశారు.

రావి కొండలరావు (జయంతి)




ప్రముఖ సినీ నటుడు రావి కొండలరావు 1932 ఫిబ్రవరి 11న కాకినాడ జిల్లా సామర్లకోటలో జన్మించారు. ఆయన నటుడిగానే కాక దర్శకుడు, రచయిత, పాత్రికేయుడు, నిర్మాతగా రాణించారు. సుమారు 600 చిత్రాలలో నటించారు. ఆయన భార్య రాధాకుమారి కూడా సినీ నటి. ఆయన సినిమా రచనలే కాకుండా ఆంధ్రజ్యోతి సహా పలు దిన, వార, మాస పత్రికలకు రచనలు అందించారు. 'పెళ్ళి పుస్తకం' సినిమాకు ఉత్తమ కథారచయితగా నంది అవార్డు పొందారు. అంతేగా హాస్య రచయితగా గుర్తింపు పొందారు. సుకుమార్ అనే కలం పేరుతో కొన్ని రచనలు చేశారు. 2004లో తామ్రనంది పురస్కారం, కళా ప్రపూర్ణ గౌరవం, ఇతర పురస్కారాలు పొందారు. 2020 జూలై 28న కన్నుమూశారు.

బుద్ధదేబ్ దాస్ గుప్త (జయంతి)



బుద్ధదేబ్ దాస్ గుప్త 1944 ఫిబ్రవరి 11న పశ్చిమ బెంగాల్ రాష్ట్రం పురూలియా ప్రాంతం అనారలో జన్మించారు. బెంగాలీకి చెందిన సినీ దర్శకుడు, కవి. ఐదు సినిమాలకు 'నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఫర్ బెస్ట్ ఫీచర్ ఫిల్మ్' పురస్కారాలు లభించాయి. 2000లో ఉత్తమ దర్శకుడి పురస్కారం, 2007లో ఏథెన్స్ ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో గోల్డెన్ ఏథెనా పురస్కారం, 2008 మాడ్రిడ్‌లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డ్, ఇతర పురస్కారాలు పొందారు. 2021 జూన్ 10న కన్నుమూశారు.

పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ (వర్ధంతి)



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)కు అధ్యక్షుడిగా వ్యవహరించి గుర్తింపు పొందిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 1916 సెప్టెంబరు 25న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మధురలో జన్మించారు. భారతీయ జనసంఘ్‌లో క్రియాశీలకంగా కొనసాగారు. హిందుత్వ సిద్ధాంతాలతో కూడిన 'రాష్ట్రధర్మ' అనే మాస పత్రికను నిర్వహించారు. ఏకాత్మతా మానవతా వాదం అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. 1968 ఫిబ్రవరి 11న కన్నుమూశారు. కాగా 2020లో వారణాసిలో 63 అడుగుల ఉపాధ్యాయ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

బీనాదేవి (పుట్టినరోజు)



తెలుగు రచయిత్రి బీనాదేవి 1935 ఫిబ్రవరి 11న విశాఖపట్నంలో జన్మించారు. అసలు పేరు భాగవతుల త్రిపుర సుందరమ్మ. భర్త భాగవతుల నరసింగరావుతో కలసి 'బీనాదేవి' కలంపేరిట రచనలు చేశారు. దంపతులు ఒకే పేరుతో రాయటం ప్రత్యేకం. డాక్టర్ ఎల్ నరేంద్రనాథ్ సహకారంతో మనసు ఫౌండేషన్ 'బీనాదేవి సమగ్ర రచనలు' పుస్తకం ద్వారా అందిస్తున్నారు. 1972లో వీరు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు.

ఆలయాలలో విశేష పూజలు



స్వామివారికి విశేష అలంకరణ

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 10: మాఘమాసం ప్రారంభమైన నేపథ్యంలో పట్టణం సహా తాలూకా వ్యాప్తంగా లక్ష్మీవెంకటేశ్వర స్వామి, ఇతర ఆలయాలలో శనివారం విశేషపూజలు నిర్వహించారు. తాలూకాలోని తలకాయలబెట్టపై కొలువైన స్వామివారికి విశేష అభిషేకం, తోమాల సేవ, అలంకరణ, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మామిడి తోరణాలు, రంగవల్లులతో ఆలయ ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. మహామంగళారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. తదుపరి స్వామివారి పాటలు, హనుమాన్ భజన జరిగాయి. అలాగే బెళ్ళూటిలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ, పట్టణంలోని లక్ష్మీ వెంకటేశ్వ ఆలయంలోనూ ఆర్యవైశ్యమండలి ఆధ్వర్యంలో పూజలు సాగాయి. కోటి శ్రీరామ ఆంజనేయస్వామి, చింతామణి రోడ్డులోని యోగినారేయణ యతీంద్రనగర్‌లోని వీరాంజనేయ స్వామి ఆలయంలోనూ శనివారం విశేషపూజలు కొనసాగాయి. బలిజ వీరాంజనేయస్వామి ట్రస్టు నిర్వాహకులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇలా పలు ఆలయాలలో కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగాయి.

నంజుండస్వామి పోరాటాలు నాకు ప్రేరణ

» ముఖ్యమంత్రి సిద్దరామయ్య



ఫ్రీడంపార్కులో వేదికపై సీఎం సిద్దరామయ్య తదితరులు

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకోసం ప్రొఫెసర్ ఎండీ నంజుండస్వామి చేసిన పోరాటాలు నాకు రాజకీయ ప్రేరణ అని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. కెంగల్ హనుమంతయ్య 88వ జయంతిని పురస్కరించుకుని ఫ్రీడంపార్కులో రైతుసంఘాలు ఏర్పాటు చేసిన సభలో ముఖ్యులుగా పాల్గొన్నారు. రైతులకు అనుకూలంగా బడ్జెట్ రూపొందించాలని రైతుసంఘాల ప్రతినిధులు సీఎంకు వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నంజుండస్వామి ప్రారంభించిన స్టడీ సర్కిల్ ద్వారానే ఎన్నో అంశాలు బహిరంగమయ్యాయన్నారు. సమాజవాది, ఆర్థికత, రాజకీయాల పట్ల స్పష్టత వచ్చిందన్నారు. సర్కిల్‌కు ఎంతోమంది ప్రొఫెసర్‌లు, సాహితీవేత్తలు వచ్చేవారన్నారు. నంజుండస్వామి చివరిదాకా రైతులకోసం పోరాటాలు చేశారన్నారు. రైతు పోరాటాలు, రైతుల సభలో పాల్గొనడం నాకెంతో సంతోషమన్నారు. సమావేశానికి బడగలాపుర నాగేంద్ర అధ్యక్షత వహించగా మంత్రి మహదేవప్పతోపాటు బీసీ సంఘాల కూటమి అధ్యక్షుడు రామచంద్రప్ప, ఎమ్మెల్యే దర్శన్ పుట్టణ్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి సమర్థుడైన అభ్యర్థి రంగనాథ్

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర



బెంగళూరు ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థి తరపున ప్రచారం చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అత్యంత పవిత్రమైన విద్యారంగానికి సమర్థుడైన అభ్యర్థి ఏపీ రంగనాథ్‌ను ఎంపిక చేశామని, ఆయన ఎన్డీయే అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర ఏర్కొన్నారు. మల్లేశ్వరంలోని విద్యా మందిరంలో శనివారం ఎన్డీయే అభ్యర్థి తరపున పార్టీ సీనియర్ నేతలతో కలసి ప్రచారం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉప ఎన్నిక ఏర్పడ్డానికి కారకులైనవారిని పక్కన పెట్టాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. యడియూరప్ప, బొమ్మైలు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో విద్యారంగానికి పెద్దపీట వేశారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించారన్నారు. న్యాయవాదిగా ఉన్న రంగనాథ్‌కు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. పదే పదే పార్టీలు మార్చే వారికి తగినబుద్ధి చెప్పాలన్నారు. మల్లేశ్వరం విద్యామందిరం, ఎమ్మెల్యే కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి డీవీ సదానంద గౌడ, మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు హరీశ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వివేక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకంతో విద్యలో గుణాత్మకత



శిబిరం ప్రారంభంలో మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ యువరాజు తదితరులు

బంగారపేట, ఫిబ్రవరి 10: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పిల్లలకు పౌష్టికాహారం ద్వారా గుణాత్మక విద్యసాధ్యమని తద్వారా ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందని మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ యువరాజు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చేందుకు మాత్రమే కాకుండా ఆకలి తీర్చేలా మధ్యాహ్నభోజన పథకం ఉందన్నారు. సగటు మధ్య తరగతి వర్గాల ప్రజలకు, వారి పిల్లలకు ఎంతో ఉపకారిగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం పోషణ్ పథకం కూడా సహకారిగా ఉందన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో తాలూకా పంచాయతీ, విద్యాశాఖ సహకారంతో ఏర్పాటైన పీఎం పోషణ్ అభియాన శిబిరాన్ని శనివారం ప్రారంభించి మాట్లాడారు. 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనపథకం అమలవుతోందని ఇందులో లింగ, సామాజిక వర్గబేధాలు లేవన్నారు. వంటచేసే ప్రదేశాన్ని, భోజన ప్రాంతాన్ని స్వచ్ఛంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛత పాటించడంలో విద్యార్థులు కూడా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కృష్ణప్ప, ఎస్సీ, ఎస్టీ సమన్వయ అధికారి నాగరాజు, బీఆర్‌సీ నిర్మల, సిబ్బంది అరుణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు



పోటీల ప్రారంభంలో ప్రముఖులు

బాగేపల్లి, ఫిబ్రవరి 10: రాజ్యాంగంపై జాగృతి జాథాలో భాగంగా రంగవల్లుల పోటీలు శనివారం ఉత్సాహంగా సాగాయి. సమానత్వం, సహజీవనం, భ్రాతృత్వం అనే భావాలు ప్రజల్లో మరింత పెరగాలని కోరుతూ రాజ్యాంగ రథం తాలూకా వ్యాప్తంగా సంచరిస్తోంది. ఇందులో భాగంగా దేవరగుడిపల్లికి చేరుకోగా గ్రామపంచాయతీ నిర్వాహకులు ఘనంగా స్వాగతించారు. చేళూరు తాలూకా నుంచి వచ్చిన రథానికి మంగళహారతులు, వాద్యాలతో స్వాగతించారు. పురవీధులలో జాగృతి రథం సాగగా విద్యార్థులు, వివిధశాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు. సాంఘిక సంక్షేమశాఖ సహాయక డైరెక్టర్ శేషాద్రి మాట్లాడుతూ సమాజాన్ని బాగు చేసేలా రాజ్యాంగం రూపొందించబడిందన్నారు. ప్రత్యేకించి అణగారిన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారన్నారు. జాథాలో భాగంగా రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యక్షురాలు సుజాతమ్మ, పీడీఓ శంకరప్ప, ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశ్వత్థప్ప, దళిత సంఘం ప్రముఖులు నాగప్ప, లక్ష్మీ, గ్రామపంచాయతీ సభ్యులు వెంకటరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనంతో ఎన్నో ప్రయోజనాలు

» హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌లో ఆకట్టుకున్న పుస్తకసంత



పుస్తకాలను ఆసక్తిగా తిలకిస్తున్న సీఎం సిద్దరామయ్య, సభాపతి హొరట్టి, మాజీ ఎంపీ ఉగ్రప్ప తదితరులు

బొమ్మనహళ్ళి, ఫిబ్రవరి 10: పుస్తకాలు చదవడం వల్లఎంతో విజ్ఞానం పొందడమే కాక మరెన్నో ప్రయోజనాలు సాధ్యమని ముఖ్యమంత్రి సిద్ద రామయ్య అభిప్రాయపడ్డారు. హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని స్వాభిమాన పార్క్‌లో శనివారం మాజీ ఎంపీ ఉగ్రప్ప నేతృత్వంలో ఏర్పాటైన పుస్తక సంత ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పుస్తక పఠ నం ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలన్నారు. మంచి చెడుల గురించిన ఎన్నో అంశాలు, సమాజంలోని మార్పుల గురించి, శాస్త్ర సాంకేతిక అంశాలను పుస్తకాల ద్వారా తెలుసుకోవచ్చునన్నారు. ప్రస్తుతం యువకులు, పిల్లలు మొబైల్‌కే పరిమితం అవుతున్నారని, పుస్తకాలపై సక్రమంగా దృష్టి సారించడం లేదన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలు కొని చదవాలని సీఎం అభిప్రాయపడ్డారు. దేశ ఆర్థిక, సాంస్కృతిక, చరిత్ర, తదితర అంశాలపై పుస్తకాలు ఇక్కడ ఉన్నాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనానికి కొంత సమయం కేటాయించాలన్నారు. ఈ సందర్భంగా సీఎం కూడా కొన్ని పుస్తకాలు కొనుగోలు చేశారు. ఉగ్రప్ప మాట్లాడుతూ యువతలో చైతన్యం కల్పించే ఉద్దేశ్యంతో పుస్తకమేళా ఏర్పాటు చేశామన్నారు. మేళాలో 135 బుక్ స్టాల్స్ ఏర్పాటు చేయగా సందర్శకుల కోసం మరికొన్ని ఆర్గానిక్ ఫుడ్ స్టాల్స్ చేశారు. రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు సీఎం బహుమతులు ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు కూడా కొనసాగాయి. కార్యక్రమంలో మంత్రి రామలింగారెడ్డి, పరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి, విజయ్‌సంకేశ్వర్, రచయితలు బరగూరు రామచంద్రప్ప, శూద్ర శ్రీనివాస్, వీణలోక శ్రీనివాస్, హెచ్ఎస్ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, కేపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు వాసుదేవరెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ఆదివారం కూడా పుస్తక సంత కొనసాగనుంది.

చెరువుల సంరక్షణలో మిత్సుబిషి



ప్రారంభోత్సవంలో ప్రముఖులు

బెంగళూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): మిత్సుబిషి ఎలక్ట్రిక్ ఇండియా తన గ్రూప్ కంపెనీ అయిన మిత్సుబిషి ఎలివేట్ ఇండియా సహకారంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చెరువుల శుద్ధీకరణ చేపట్టింది. ఇందులో భాగంగా బెంగళూరు సమీపంలోని వేమగల్‌లోని చెన్నప్పనహళ్ళి చెరువును పూర్తిగా సంస్కరించి స్థానిక పాలనాయంత్రాంగానికి అప్పగించింది. తన సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా 2021లో ఈ సంస్కరణ కార్యక్రమాలను చేపట్టినట్టు సంస్థ ఎలివేట్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శోయిచిరో ఓడా మీడియాకు తెలిపారు. ప్రజల తాగునీటి దాహార్తి తీర్చడంతోపాటు పశుపక్ష్యాదులకు ఉపయుక్తంగా ఉండేలా చెరువును సంస్కరించామన్నారు. చెరువు సంరక్షణకోసం ప్రత్యేక పెన్సింగ్‌తోపాటు సోలార్ విద్యుద్దీపాలను, చెరువు సమీపంలో పిల్లలకోసం ఆటమైదానాన్ని, పెద్దలకోసం జిమ్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. చుట్టుపక్కల ప్రజలకు ఇది ఉపయుక్తం కానుందన్నారు. 2021లో చెరువు సంస్కరణ పనులు చేపట్టినప్పుడు ఇప్పుడు పూర్తయ్యాక గమనిస్తే తమకే ఎంతో ఆశ్చర్యం కలిగిందన్నారు. చెరువు ప్రదేశంలో వ్యాహ్యాళికోసం ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రముఖులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

పాడిరంగంతో ఆర్థిక స్వావలంబన



విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తున్న అధికారులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 10: ప్రస్తుత కరువు పరిస్థితుల్లో వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా పాడిరంగంపై దృష్టి సారించి రాణించడం ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలని డాక్టర్ శ్రీనాథ్ అభిప్రాయపడ్డారు. తాలూకా పశుసంవర్ధకశాఖ, కోలారు, చిక్కబళ్ళాపుర పాల సమాఖ్య, తలదుమ్మనహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తాలూకాలోని తలదుమ్మనహళ్ళిలో జెర్సీ ఆవుల నుంచి పాలు పితికే పోటీలు నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ సహాయక డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన పాలను సరఫరా చేయడం ద్వారా సంఘం కూడా లాభాలబాటలో సాగుతుందన్నారు. ఈ సందర్భంగా పశువులకు టీకాలు, బీమా ఆవశ్యకత గురించి వివరించారు. పోటీల్లో 33మంది పాల్గొనగా విజేతలతోపాటు పాల్గొన్న అందరికీ సంతృప్తికర బహుమతులను ప్రదానం చేశారు. 23 లీటర్ల పాలతో కిశోర్, 21.6 లీటర్ల పాలతో దేవరాజ్, 19.7 లీటర్ల పాలను పిండడం ద్వారా నరసింహప్ప వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తల దుమ్మనహళ్ళి ఎంపీసీఎస్ అధ్యక్షుడు మంజునాథ్, ఉపాధ్యక్షుడు మునిరాజు, సీఈఓ నవీన్ టీవై, పశుసంవర్ధకశాఖ డాక్టర్‌లు సౌమ్య, యశ్వంత్, ప్రశాంత్, డాక్టర్ చందన్, బిందుజా తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం ఆహారం ఇవ్వాలని వాగ్వాదం

చేళూరు, ఫిబ్రవరి 10: తాలూకాలోని పాలకేరి గ్రామపంచాయతీ కేంద్రంలోని హాస్టల్‌లో మెనూ ప్రకారం ఆహారం ఇవ్వాలని విద్యార్థులు అడగడం వాగ్వాదానికి కారణమైంది. విద్యార్థులు హెడ్‌కుక్‌తో గొడవపడ్డారు. హాస్టల్‌లో 45 మంది విద్యార్థులు ఉన్నారు. కనీస సదుపాయాలు కల్పించడం లేదని, హాస్టల్ గదులను మరమ్మత్తు చేయించాల్సి ఉందన్నారు. కనీసం వేడినీరు సదుపాయం లేదన్నారు. కాగా కోటా ప్రకారం వడ్డించాల్సిన కోడిగుడ్లు, మాంసం కూడా ఇవ్వకనే బిల్లులు మాత్రం చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. కాగా ఇటీవల యాక్సిడెంట్ కావడంతో హాస్టల్ వార్డెన్ అందుబాటులో లేరు.

ఇకపై ఆరేళ్ల చిన్నారులకు హెల్మెట్ తప్పనిసరి

» బెంగళూరు ట్రాఫిక్ పోలీసుల ఆదేశం

బెంగళూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో ప్రమాదాల నివారణ కోసం బెంగళూరు ట్రాఫిక్ అధికారులు కొత్త నిబంధనలకు శ్రీకారం చుట్టారు. ఆరేళ్ల పైబడిన చిన్నారులకు హెల్మెట్ తప్పనిసరి చేశారు. జరిమానా వసూలు చేసేందుకు ఇకపై ఇళ్లకే పోలీసులు వస్తారనే ఆదేశాలు జారీ చేశారు. పాఠశాలలకు చిన్నారులను వదిలే వేళ వారికి తప్పనిసరిగా హెల్మెట్ ఉండాల్సిందే అన్నారు. ఆటోలు, ప్రైవేట్ వాహనాలు, స్కూల్ వెహికల్స్‌లోనూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. పరిమితికి మించి విద్యార్థులు ఉంటే సంబంధిత వాహనదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ పోలీసుల గస్తీ ఉన్నా స్కూల్ వెహికల్స్ డ్రైవర్‌లు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు ఉన్నాయి. 50వేలకుపైగా జరిమానా ఉన్న వాహనదారుల నుంచి వసూళ్లకోసం పోలీసులు నేరుగా ఇళ్లకే వస్తారని అధికారులు తెలిపారు. రూ.50వేలకు పైబడి జరిమానా కల్గిన వాహనాలు నగరంలో 2681 ఉండగా ఇప్పటివరకు 120మంది నుంచి వసూలు చేశారు. నగరంలో 1.2కోట్ల వాహనాలు రోజూ సంచరిస్తుండగా ప్రతిరోజూ 2,300 కొత్త వాహనాలు చేరుతున్నాయి.

డీసీఎంతో ఎమ్మెల్సీ, రక్షారామయ్య భేటీ



డీసీఎంతో చర్చిస్తున్న ఎంఆర్ సీతారాం, రక్షారామయ్య

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌ను సదాశివనగర్‌లోని నివాసంలో శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎంఆర్ సీతారాం, ఆయన కుమారుడైన యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రక్షారామయ్య భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో చిక్కబళ్ళాపుర నుండి కాంగ్రెస్ టికెట్ పై పోటీచేయాలని రక్షారామయ్య ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ భేటీ రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. సమాజసేవలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన రక్షారామయ్యకు చిక్కబళ్ళాపుర నియోజకవర్గంలో మంచి ఫాలోయింగ్ ఉందని పైగా సామాజిక సమీకరణలు సైతం కాంగ్రెస్‌కే అనుకూలంగా ఉన్నాయని ఈ సందర్భంగా ఎంఆర్ సీతారాం పేర్కొన్నట్లు తెలిసింది. టికెట్‌పై అధిష్ఠానానిదే అంతిమ నిర్ణయమని డీకే పేర్కొన్నట్లు సమాచారం. చిక్కబళ్ళాపుర టికెట్ తనకే లభిస్తుందన్న ఆశాభావంతో రక్షారామయ్య ఉన్నారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆశీస్సులు మెండుగా ఉండటం ఇందుకు మరో కారణంగా భావిస్తున్నారు.

వృద్ధురాలికి.. మూడు గంటల్లోనే పాస్‌పోర్ట్

బెంగళూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విదేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్ట్ సిద్ధం చేసుకోవడం అంత సులువు కాదు. ప్రతి రికార్డు పరిశీలనతోపాటు పలు ప్రక్రియలు పూర్తి చేసేందుకు నెలల గడువు పడుతుంది. కానీ బెంగళూరు ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం నగరానికి చెందిన ఓ వృద్ధురాలికి కేవలం మూడు గంటల్లోనే పాస్‌పోర్ట్‌ను సమకూర్చారు. అమెరికాలోని కొలరాడోలో నివసించే 43ఏళ్ల కుమారుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. కనీసం చివరిచూపు చూడాలని బెంగళూరులో నివసించే తల్లి భావించారు. ఇదే విషయమై ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి వెళ్లి రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకున్నారు. మానవత్వంతో వ్యవహరించిన అధికారులు దరఖాస్తు చేసుకున్న మూడు గంటల్లోపే పాస్‌పోర్ట్ రెన్యూవల్ చేశారు. వృద్ధ దంపతులకు వీసా ఉన్నా తల్లి పాస్‌పోర్ట్ రెన్యూవల్ గడువు ముగిసింది. ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాధికారి కృష్ణ పాస్‌పోర్ట్ రెన్యూవల్ విషయాన్ని మీడియాతో శుక్రవారం పంచుకున్నారు. ఆమె వెంటనే అమెరికాకు వెళ్లాల్సి ఉన్నందున పోలీస్ వెరిఫికేషన్ అంశాన్ని ఇండియాకు వచ్చాక పరిశీలించేలా సూచించామన్నారు.

23 వరకు రాజధానిలో అందుబాటులో ఉండను

» ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 11నుంచి 23వరకు బెంగళూరు సదాశివనగర్‌లోని తన నివాసంలో ప్రజలకు అందుబాటులో ఉండనని సహకరించాలని ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ విజ్ఞప్తి చేశారు. బడ్జెట్ సమావేశాలు, వరుసగా పార్టీ సమావేశాలు వ్యక్తిగత కార్యక్రమాలతో తాను బిజీగా ఉంటానన్నారు. 11న తమ కుటుంబంలో వివాహ కార్యక్రమం ఉందని, 12న శాసన సభ ఉభయసభల సమావేశాలు, 14న లోక్‌సభ ఎన్నికల సన్నాహక సభ, 15న రాజ్యసభ ఎన్నికల నామినేషన్‌ల వ్యవహారం, 16న మహారాష్ట్రలోని లూనావాలలో కాంగ్రెస్ కీలక సమావేశంలో డీకే శివకుమార్ పాల్గొంటున్నారు. 17న మంగళూరులో రాష్ట్రస్థాయి కార్యకర్తల సమావేశం, 18న 'బాగిలిగె బంతు సర్కార' వంటి కార్యక్రమాలతో డీసీఎం బిజీగా ఉంటారు. ఈనెల 23వరకు శాసనసభ సమావేశాలు జరుగుతాయని అంతవరకు తనను భేటీ కావద్దని ప్రకటనలో కోరారు. ఈ మేరకు డీసీఎం కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

దశాబ్దకాలం దేశమంతటా అధ్వానం : సీఎం

బెంగళూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గడిచిన పదేళ్లను బీజేపీ నాయకులు అమృతకాలగా వర్ణిస్తున్నారని, వాస్తవానికి వినాశకాలం, అధ్వానమనేది దశాబ్దంలోనే జరిగిందని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. దేశంలో రైతులు, కార్మికులు, మహిళలు, యువత, అన్ని వర్గాల సమస్యలు ఐదింతలు పెరిగాయన్నారు. పదేళ్లలో ప్రధాని నరేంద్రమోదీ ప్రజలకు ఇచ్చిన ఒక హామీని కూడా నెర వేర్చలేదన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు, ఏటా 2కోట్ల ఉద్యోగాలు, మహిళలకు రక్షణ, కార్మికులకు ఉద్యోగ భద్రత, వెనుకబడినవర్గాలకు తక్కువ ధరలోనే నిత్యావసరాలు సాధ్యం చేయలేదన్నారు. ప్రజలకు రంగుల రూపంలో చూపిన హామీలను నెరవేర్చలేదన్నారు. దేవుడు, ధర్మం పేరిట భావనాత్మకమైన రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. పదేళ్లలో ప్రధాని మోదీ అన్యాయకాల వివరాలను అంకెలతో సహా కర్ణాటక ప్రజల ముందు ఉంచుతానని అమృతకాలమా... లేక మరేదో ప్రజలే తీర్మానించాలన్నారు. ఈ మేరకు శనివారం ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు శుభవార్త

» పనికి తగిన వేతనం

బెంగళూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా అన్ని మహానగర పాలికె, నగర సంస్థలలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ పేమెంట్, కంట్రాక్ట్, సబ్ కంట్రాక్ట్ విధానంతో పనిచేసే వారందరికీ సమాన పనికి తగిన వేతనం చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి మునిసిపల్ వ్యవహారాల డైరెక్టర్ సర్క్యులర్ జారీ చేశారు. డి గ్రూప్‌లో పనిచేసే పౌర కార్మికులు, లోడర్స్, క్లీనర్స్, హెల్పర్స్ వంటి వారందరికీ పనికితగిన వేతనం ఇవ్వదలిచారు. వీరి వేతనాలను కంట్రాక్టర్‌లకు నెలవారీ నగరపాలిక సంస్థలు జమ చేయాల్సి ఉంటుంది. అయితే బిల్లులు సమర్పించడంలో జాప్యం వాటిని సంబంధిత అధికారులు పర్యవేక్షించడంలో నిర్లక్ష్యం చేస్తున్న కారణంగా రెండు మూడు నెలలకోసారి వేతనాలు తీసుకునే పరిస్థితి ఏర్పడింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా నగర పాలక సంస్థలలో పనిచేసే డి గ్రూప్ ఉద్యోగులు ఆందోళన చేసిన మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రతి నెలా 5వ తేదీలోగానే డి గ్రూప్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేశారు.

ద్విచక్ర వాహనాల ఢీ.. యువకుడి మృతి



మనోజ్‌కుమార్ (ఫైల్)

చింతామణి, ఫిబ్రవరి 10: జాతీయ రహదారి 234పై శ్రీనివాసపుర మార్గంలో హందిజోగిగడ్డ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయ పడ్డాడు. శుక్రారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో ఊలవాడి గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ (21) మృతి చెందినట్టుగా గుర్తించారు. గాయపడిన వ్యక్తిని కోలారు జిల్లా శ్రీనివాసపుర పట్టణంలోని అంబేడ్కర్ కాలనీ నివాసి నరసింహమూర్తిగా గుర్తించారు. నరసింహమూర్తిని స్థానికులు రక్షించి చికిత్స కోసం కోలారు ఆసుపత్రికి తరలించారు. చింతామణి నుంచి శ్రీనివాసపురకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మనోజ్‌కుమార్‌ను ఢీ కొన్నాడని తల్లి నాగవేణి వాపోయింది. ప్రమాదంలో దెబ్బతిన్న రెండు ద్విచక్రవాహనాలను చింతామణి రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.